AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 29న ఆర్టీసీ కార్గోలో వస్తువుల వేలం



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ఆర్టీసీ కార్గో పార్సిల్ సర్వీస్ సెంటర్‌లో వస్తువులను వేలం వేస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29న కార్గో సెంటర్‌లో కస్టమర్లు తీసుకెళ్లకుండా వదిలేసిన వస్తువులను వేలం వేస్తున్నామన్నారు. కావున మధ్యాహ్నం 3 గంటలకు ఆసక్తి గల వారు నేరుగా కార్గో సెంటర్‌కు వచ్చి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఈ వస్తువులపై ఛార్జీల్లో 50శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు.


27-5-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## అన్నదాతల ఆగ్రహ జ్వాల..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా అన్నదాతలు ఆగమవుతున్నారు. ధాన్యం రైస్‌మిల్లులకు తరలించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎల్లారెడ్డి–హైదరాబాద్ రోడ్డుపై బుధవారం ధాన్యం తగలబెట్టి రైతులు నిరసన వ్యక్తం చేశారు. నాగిరెడ్డిపేట మండలం కన్నారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి ధాన్యం బస్తాలు తరలించేందుకు కొన్నిరోజులుగా లారీలు రావట్లేదు. దీంతో రైతులు బుధవారం ధాన్యం బస్తాలను ఎల్లారెడ్డి–హైదరాబాద్ రోడ్డుపై తగలబెట్టి ధర్నాకు దిగారు. కేంద్రంలో తూకాలు అయినప్పటికీ రోజుల తరబడి ధాన్యం బస్తాలు అక్కడే ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా ఆందోళన నెలకొందన్నారు. నెల రోజులుగా కేంద్రంలోనే రేయింబగళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## బక్రీద్ పండుగకు ఏర్పాట్లు



**అక్షరటుడే, కామారెడ్డి:** బక్రీద్ సందర్భంగా మైనారిటీలకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి తెలిపారు. పట్టణంలోని ప్రధాన ఈద్గాల వద్ద జరుగుతున్న పనులను కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. ముస్లింలకు ప్రార్థనల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈద్గా పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, పండుగ రోజంతా శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఈద్గాలకు వెళ్లే దారుల్లోని గుంతలు పూడ్చాలని, వీధి దీపాలను పునరుద్ధరించి వెలుతురు సమస్య లేకుండా చూడాలన్నారు.

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. పంట చేతికొచ్చిన ఆనందం కంటే.. అది ఎప్పుడు కొంటారోనన్న దిగులే రైతుల్లో కనిపిస్తోంది. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వానాకాలం సీజన్ సమీపిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఖాళీ కావడం లేదు. మరోవైపు అకాల వర్షా లు రైతులను ఆగం చేస్తున్నాయి.

–అక్షరటుడే, కామారెడ్డి



# అన్నదాతల.. వరిగోస

పంట అమ్ముకోవడానికి అవస్థలే..

కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం

అకాల వర్షా నికి తడిసిన వడ్లు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

కామారెడ్డి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు సాగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంటా వేసిన ధాన్యం తరలించడానికి లారీలు రావడం లేదు. దీంతో నెలల తరబడి కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కోసింది మొదలు కల్లాల నుంచి కొనుగోలు కేంద్రాలకు చేర్చే వరకు రైతు నరకం చూస్తున్నాడు. హమాలీ ఖర్చులు, ట్రాక్టర్ కిరాయిలు భరించి కేంద్రానికి తీసుకొస్తే అక్కడ తూకం వేయడం లేదు. తీరా కాంటా చేసినా.. వాటిని మిల్లులకు తరలించడానికి లారీలు రావడం లేదు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### తడిసిపోతున్న ధాన్యం

జిల్లాలో గత నాలుగు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. దీంతో కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఎండబెట్టి, తూర్పారబట్టి తీసుకొచ్చిన ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ దానిని ఎండబెట్టడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### తరుగు పేరిట దోపిడీ

ఒక వైపు ప్రకృతి దెబ్బ కొడుతుంటే మరోవైపు తరుగు, తాలు పేరుతో మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారు. క్వింటాలుకు 3 నుంచి 5 కిలోలు కోత పెడుతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం రైతులను మోసం చేస్తున్నారు.

లారీలు రావడం లేదని సాకు చెప్పి బస్తాకు రూ.5 నుంచి రూ.10 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. రోజుల తరబడి ధాన్యం కేంద్రాల్లో ఉండటంతో బరువు తక్కువా వస్తున్నాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

### జిల్లావ్యాప్తంగా 1,100 దెబ్బతిన్న పంట

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అకాల వర్షాల కారణంగా జిల్లాలో సుమారు 1,100 మెట్రిక్ టన్నుల వరి పంట దెబ్బతిన్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు అధికారులు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,78,000 మెట్రిక్ టన్నుల వరి సేకరణ పూర్తయినట్లు తెలిపారు. ఇందులో ప్రస్తుతం 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలో ఉన్నట్లు పేర్కొన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడవకుండా వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీరు నిల్వ ఉండకుండా కందకాలు, కాలువలు ఏర్పాటు చేయాలని, ధాన్యం కుప్పలను టార్పాలిన్లతో కప్పాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

### 50 రోజులైంది..

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి 50 రోజులైంది. కాంటా వేసేవాళ్లు లేరు. లారీలు రావడం లేదు. అకాల వర్షానికి మొత్తం తడిసిపోయింది. కుప్పల్లోకి నీళ్లు వచ్చాయి. మా రైతుల పట్ల ప్రభుత్వం స్పందించాలి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.



- పడిగె సాయిలు, రైతు

### మమ్మల్ని ఆదుకోవాలి

అకాల వర్షానికి ధాన్యం మొత్తం తడిసిపోయింది. పంట తెచ్చి నెల రోజులైంది. లారీలు రావడం లేదు. కొనడం లేదు. ఇలా అయితే మేము ఎలా బతకాలి. రైతన్నల పరిస్థితిని ప్రభుత్వం చూడాలి. మమ్మల్ని ఆదుకోవాలి.




- ఎనగుర్తి సాయిలు, రైతు

## వరి కొయ్యలను కాల్చడంతో పర్యావరణానికి నష్టం



**అక్షరటుడే, కోటగిరి:** వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిన వరి కొయ్యలను కాల్చడంతో పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలుగుతుందని పోతంగల్ మండల వ్యవసాయ అధికారి నిశిత అన్నారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బనం, నత్రజని, భాస్వరం, ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి భూసార నాణ్యత తగ్గిపోతుందని తెలిపారు. అదే కాకుండా వరి కొయ్యల దహనం వల్ల గాలి కాలుష్యం పెరగడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికర వాయువులు వాతావరణంలోకి విడుదల అవుతున్నాయన్నారు. రైతులు పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా వరి కొయ్యల దహనాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. పంట అవశేషాలను బహిరంగంగా కాలిస్తే రూ.5వేల జరిమానా విధిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ హెచ్చరిక జారీచేసిందన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా, రోటావేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, పశువుల మేతగా వినియోగించడం, కంపోస్ట్ తయారీలో ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను రైతులు అనుసరించాలని సూచించారు. రైతులు పర్యావరణ హిత వ్యవసాయ పద్ధతులను అవలంభించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ దంపతులు



**అక్షరటుడే, ఇందూరు:** కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ దంపతులు బుధవారం పెళ్లిరోజును పురస్కరించుకొని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూరు వాసులు సుఖశాంతులతో.. ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అలాగే రైతుల కష్టాలు దూరం చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

## ధాన్యం తడవకుండా మిల్లులకు తరలించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** అకాల వర్షాలతో రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా వేగంగా మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కామారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.


### కామారెడ్డి మండలంలో..

కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలోని గురు రాఘవేంద్ర రైస్ మిల్లును తనిఖీ చేసి ధాన్యం నిల్వలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియపై సమీక్షించారు. ప్రతిరోజూ కనీసం 15 లారీల ధాన్యం దించుకోవాలని మిల్లర్లకు సూచించారు. అనంతరం శాబ్దిపూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూరి ఎల్లారెడ్డి కొనుగోలు కేంద్రం, శ్రీ మన్నారాయణ రైస్ మిల్లును పరిశీలించారు. అకాల వర్షాలకు జిల్లాలో సుమారు 1,100 మెట్రిక్ టన్నుల వరి దెబ్బతిన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో 3,78,000 మెట్రిక్ టన్నుల వరి సేకరణ పూర్తయ్యిందని, ప్రస్తుతం 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలో



ఉందని తెలిపారు. వర్షాలకు ధాన్యం తడవకుండా వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీరు నిల్వ లేకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, ధాన్యం కుప్పలను టార్పాలిన్‌లతో కింది నుంచి పైకి, పైనుంచి కిందకు పూర్తిగా కప్పి ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, తహశీల్దార్లు, సిబ్బంది ఉన్నారు.

## నిరుద్యోగ యువతకు న్యాక్ ద్వారా శిక్షణ



**అక్షరటుడే, నిజామాబాద్‌అర్బన్:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో న్యాక్ ద్వారా ఆయా ట్రేడ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. మూడు నెలల శిక్షణ కాలానికి గాను రూ.18వేల రుసుము ఉండగా, జిల్లా యంత్రాంగం తరపున 50 శాతం రాయితీని కల్పిస్తామన్నారు. అభ్యర్థులు కేవలం రూ. 9వేలు (మూణ్నెళ్లకు) మాత్రమే చెల్లించి ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మేసన్, టైలరింగ్ ట్రేడ్లలో శిక్షణ పొందవచ్చని సూచించారు. శిక్షణ కాలంలో అనుభవజ్ఞులైన ట్రైనర్లతో అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి కోసం ప్రాక్టికల్స్‌తో పాటు థియరీలో నాణ్యమైన శిక్షణ అందించబడుతుందన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయని కలెక్టర్ తెలిపారు. శిక్షణ సందర్భంగా ఉచిత యూనిఫామ్, ఉచిత స్టేషనరీ, అధునాతన, సాంకేతికతతో కూడిన యంత్ర పరికరాలతో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనుభవజ్ఞులైన ఇన్స్ట్రక్టర్లతో సమర్థవంతమైన శిక్షణ, న్యాక్ ద్వారా గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. న్యాక్ సంస్థ ద్వారా ఇదివరకు వివిధ ట్రేడ్లలో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు పూర్తిస్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయన్నారు. శిక్షణ తరగతులను న్యాక్ అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షణ జరుపుతారని, అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా కృషి చేస్తారన్నారు.

## పదోన్నతి బాధ్యత పెంచుతుంది



**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీసుశాఖలో పదోన్నతులు గుర్తింపుతో పాటు విధుల పట్ల బాధ్యతను పెంచుతాయని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. బీబీపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న టి.మధుసూదన్ రావు ఎస్సైగా పదోన్నతి పొందడంతో బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మధుసూదన్ రావుకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యూనిఫాంపై పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పదోన్నతులు సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా సమాజం పట్ల మరింత బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు. పదోన్నతి అనేది కేవలం హోదా మార్పు మాత్రమే కాదని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించే బాధ్యత కూడా అని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి ఒక 'ఫెయిల్యూర్ సీఎం'..



**అక్షరటుడే, భీమ్‌గల్/ఆర్మూర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, సీఎం రేవంత్ రెడ్డి కేవలం ఒక 'ఫెయిల్యూర్ సీఎం'గా మిగిలిపోయారని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ అవగాహన సదస్సు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అత్యంత పటిష్టంగా ఉందనడానికి ఈ సమావేశానికి తరలివచ్చిన జనసందోహమే నిదర్శనమన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ పోరాడే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని కొనియాడారు. తెలంగాణలోని ఏ గ్రామానికి వెళ్లినా 'మళ్లీ కేసీఆర్ పాలనే రావాలి' అని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, వందల రోజులు దాటినా ఒక్క హామీని కూడా సరిగ్గా అమలు చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై తరుగు పేరుతో క్వింటాలుకు 12 కిలోల చొప్పున కోత విధిస్తూ రైతుల కష్టార్జితాన్ని దారుణంగా దోచుకుంటోందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే రూ. 200 కోట్లు, రాష్ట్రవ్యాప్తంగా రూ. 2,000 కోట్ల రైతుల సొమ్మును మిల్లర్లు, కాంగ్రెస్ నేతలు పంచుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆశన్నగారి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్ గుప్తా, హన్మంత్ షిండే తదితరులు పాల్గొన్నారు.

## 35 మంది హోంగార్డులకు పోస్టింగులు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో 35 మంది హోంగార్డులకు కౌన్సెలింగ్ ద్వారా పారదర్శక బదిలీలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 35 మంది హోంగార్డులకు బదిలీలు నిర్వహించారు. ఇందులో నిజామాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన 32 మందితో పాటు జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ముగ్గురు హోంగార్డులు ఉన్నారు. ఒక్కో హోంగార్డుతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి ఇష్టం, సీనియారిటీ, భార్యాభర్తల ఉద్యోగం, ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పోస్టింగ్‌లు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డులంతా క్రమశిక్షణతో పనిచేయాలని, ప్రజలకు నిజాయితీగా సేవలు అందించాలన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ మొత్తానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్ఐలు సంతోష్, నవీన్ కుమార్, కృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## చెరువు కబ్జాపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఇందల్వాయి పెద్ద చెరువు కబ్జాపై బుధవారం ఇందల్వాయి ప్రజా ప్రతినిధులు, వీడీసీ సభ్యులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వారు కలిసి ఫిర్యాదు చేశారు. చెరువు కబ్జా విషయమై ఎమ్మెల్యేకు వారు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే కబ్జాకు గురైన శిఖం భూమిని వెంటనే సర్వే నిర్వహించి ట్రెంచ్ వేయించాలని ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. చెరువు కబ్జాకు గురవుతోందని వెంటనే రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు చెరువును పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే జరుగుతున్నప్పుడు అందరూ సహకరించాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సర్పంచ్, ఉపసర్పంచ్ వీడీసీ సభ్యులు శాలువాతో సన్మానించారు. గ్రామంలోని వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## మహిళా సంఘాలకు రూ.6.55 కోట్ల బ్యాంకు రుణాలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండల కేంద్రంలో బుధవారం 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక'లో భాగంగా మండల మహాసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ అధ్యక్షులు రజిత వెంకట్ రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలో ఉత్తమ సేవలు అందించిన బెస్ట్ వీవో, బెస్ట్ వీవోఏలను ముఖ్య అతిథులు శాలువాలతో సన్మానించి అభినందించారు. మహిళా సంఘాల బలోపేతానికి వీరు చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రజిత వెంకట్ రామ్ రెడ్డి చేతుల మీదుగా మండలంలోని మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.6.55 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామ సంఘాలకు సంబంధించిన ప్యాడీ కమిషన్ మొత్తం రూ.30,84,756 చెక్కులను కూడా లబ్ధిదారులకు అందజేశారు. పామ్ యూనిట్ పథకంలో భాగంగా ఎంపికైన పామ్ బెనిఫిషరీకి పామ్ షాప్ కట్టర్‌ను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, మండల సమాఖ్య ఓబీలు, ఏపీఎం రాం నారాయణ గౌడ్, మెప్మా సిబ్బంది, ఎంఎస్ అకౌంటెంట్ మహేష్, వీవోఏలు, వీవో ఓబీలు, మహిళా సంఘాల సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## దేశానికి జవహర్ లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివి..




**అక్షరటుడే, ఇందూరు:** దేశానికి తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని డీసీసీ నిజామాబాద్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నెహ్రూ పార్క్‌లోని నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేశారు.

### ఇతర దేశాలతో పోటీ పడేవిధంగా..

ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు.. గుండు పిన్ను కూడా తయారు చేయలేని స్థితిలో ఉన్న దేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప వ్యక్తి ఆయన అని పేర్కొన్నారు. నెహ్రూ దూరదృష్టితో చేసిన అనేక సంస్కరణల వల్లే నేడు దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. దేశంలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఇస్తూ.. భారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారని, వ్యవసాయం అభివృద్ధి కోసం అనేక ప్రాజెక్టులు నిర్మించారన్నారు. జిల్లాలో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మించి జిల్లా ప్రజలకు సాగు, తాగునీటి సౌకర్యం ఆయన హయాంలోనే సాధ్యమైందన్నారు. యువతకు మెరుగైన విద్య కోసం ఐఐటీలు, శాస్త్రీయ పరిశోధన సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. కానీ ప్రస్తుతం దేశంలో ఉన్న బీజేపీ నాయకులు నెహ్రూను తక్కువచేసే ప్రయత్నం చేస్తున్నారని, ఆకాశంపై ఉమ్మివేస్తే ఏమవుతుందో వారు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కౌడపు శరత్ కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జగడం సుమన్, కోఆప్షన్ మెంబర్ నరేంద్ర సింగ్, జెండా గుడి ఛైర్మన్ లవంగ ప్రమోద్, కార్పొరేటర్ నరేందర్, శివ చరణ్, జిల్లెల రమేష్, మల్యాల గోవర్ధన్, కోనేరు సాయి కుమార్, ఆదె ప్రవీణ్, రాజ్, ముష్షు పటేల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్మూర్ బల్దియాలో పాలన అస్తవ్యస్తంగా మారింది. పురపాలక సంఘం అధికారులు సెలవుల్లో వెళ్తే ఆ సెక్షన్‌లో ఉన్న అటెండర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అధికారులు లేనిది చూసి వారు వ్యవహరిస్తున్న తీరుతో సామన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.**

**– అక్షరటుడే, ఆర్మూర్**




## అధికారి సెలవులో వెళ్తే..

# అటెండరే దిక్కు..

■ ఆర్మూర్ బల్దియాలో ఇష్టారాజ్యం.. ■ సర్టిఫికెట్ల కోసం ప్రజల అవస్థలు ■ జనన మరణాల సెక్షన్‌లో ఇదీ తీరు

ఆర్మూర్ పురపాలక సంఘం పరిధిలో 36 వార్డులు ఉన్నాయి. అలాగే లక్ష వరకు జనాభా ఉంది. అయితే బల్దియాలో ప్రజలకు సంబంధించిన జనన మరణాల సర్టిఫికెట్లు అందించే సెక్షన్ పూర్తిగా గాడి తప్పింది. సెక్షన్ ఇన్‌ఛార్జి అధికారి సెలవులో వెళ్లినప్పుడల్లా.. ఆ స్థానంలో అటెండర్ అన్నీతానై వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జనన మరణాల సెక్షన్ ఇన్‌ఛార్జీగా వ్యవహరించారు. ఆ తరువాత హెల్త్ అసిస్టెంట్‌కు ఈ సెక్షన్ అప్పగించారు. ఇందులో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్‌పై పలు ఆరోపణలు రాగా సదరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని వేరే సెక్షన్‌కు బదిలీ చేశారు. అప్పటి నుంచి హెల్త్ అసిస్టెంట్ ఒక్కరే జనన మరణాల సెక్షన్‌లో పూర్తి విధులు నిర్వహిస్తున్నారు.

### నిబంధనలకు నీళ్లు...

జననమరణాల నమోదు చట్టం ప్రకారం రిజిస్ట్రార్ హోదాలో ఉన్న అధికారి మాత్రమే సంతకం చేయాలి. ఆయన సెలవులో ఉంటే ఇన్‌ఛార్జీని నియమించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి. కానీ ఆర్మూర్ మున్సిపాలిటీలో ఆ నిబంధనలు పట్టించుకున్న దాఖలాలు లేవు. అటెండర్ స్థాయి ఉద్యోగి దరఖాస్తులు తీసుకోవడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

### తీవ్ర విమర్శలు..

సెలవులో ఉన్న అధికారి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, అటెండర్ చేతిలో పాలన పెట్టడం పాలకవర్గ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రతిపక్ష కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మెప్మా ఉద్యమ రిజిస్ట్రేషన్ ప్రత్యేక క్యాంప్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** 'ప్రజా పాలనప్రగతి' 99 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఉద్యమ రిజిస్ట్రేషన్ ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ హాజరై మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యమ రిజిస్ట్రేషన్ వల్ల మహిళా సంఘాలకు కలిగే ప్రయోజనాలపై ఆయన అవగాహన కల్పించారు. మెప్మా టీఎంసీ రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి సంఘంలోని ప్రతి సభ్యురాలు తప్పనిసరిగా ఉద్యమ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాల మంజూరు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు సులభంగా అందుతాయని వివరించారు. క్యాంప్‌లో మహిళల ఆధార్, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా, ఈకేవైసీ వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో డేటా నమోదు ప్రక్రియను చేపట్టారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకోని మహిళలు వెంటనే స్థానిక మెప్మా ఆర్‌పీలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పెద్దఎత్తున పాల్గొని క్యాంప్‌ను విజయవంతం చేశారు.

## నగరంలో దొంగ హల్‌చల్..



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో ఓ దొంగ హల్‌చల్ చేశాడు. అర్ధరాత్రి వేళ ఏకంగా ఇళ్లలోకి దూరి ప్రజలను భయపెట్టి దోపిడీకి పాల్పడ్డాడు. నగరం నడిబొడ్డున ఈ ఘటన జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.నాలుగో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మానగర్ రోడ్ నం. 2, 3లలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ దొంగ ప్రవేశించాడు. మొదట ఓ ఇంట్లోకి ప్రవేశించిని దొంగ ఇంట్లో ఉన్న వ్యక్తిని బెదిరించి మూడు గ్రాముల గొలుసు, రూ.10 వేల నగదును దోపిడీ చేశాడు. అనంతరం పక్క వీధిలో ఉన్న మరో ఇంట్లోకి ప్రవేశించి వారిని సైతం బెదిరించి రెండున్నర తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు. అనంతరం పక్కనే మరో ఇంట్లో ఉన్న ఇద్దరు వృద్ధులను భయపెట్టి వారి వద్ద నుంచి రూ.3,500 నగదును దోచుకుని పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థానానికి చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## క్రికెట్ టోర్నీ విజేత వెల్లుట్ల పేట జట్టు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వెల్లుట్ల పేటలో నిర్వహించిన సీజన్-1 క్రికెట్ టోర్నీ విజయవంతమైందని సర్పంచ్ కొయ్యల వినోద్ రాజా గౌడ్, ఉప సర్పంచ్ చెవుల రాజు యాదవ్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో వెల్లుట్ల పేట జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలవగా, వెంకటాపూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు సర్పంచ్, ఉప సర్పంచ్ చేతుల మీదుగా ట్రోఫీలు, బహుమతులు, ప్రైజ్ మనీని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన క్రీడాకారులు, గ్రామస్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## అల్జాపూర్ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే పరామర్శ



**అక్షరటుడే, ఆర్మూర్:** బీజేపీ సీనియర్ నాయకుడు, క్షత్రియ విద్యా సంస్థల అధినేత అల్జాపూర్ శ్రీనివాస్ ఆయన కుటుంబ సభ్యులను బుధవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల అల్జాపూర్ శ్రీనివాస్ సోదరుడు అల్జాపూర్ లక్ష్మీనారాయణ మృతి చెందారు. ఈ క్రమంలో ఆర్మూర్‌లోని వారి ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే వారిని పరామర్శించారు.



## పశువులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** పశువులను అక్రమంగా రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ప్రకాష్ యాదవ్ హెచ్చరించారు. బక్రీద్ పండగ నేపథ్యంలో ఇందల్వాయి కేంద్రంలో బుధవారం జరిగే ఎద్దుల అంగడిని ఏసీపీ తనిఖీ చేశారు. పశువుల వ్యాపారస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ పర్యవేక్షించి పశువుల కొనుగోలు, అమ్మకాల వివరాలు, రవాణా పత్రాలు అనుమతులు పరిశీలించారు. పశువుల రవాణా సమయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సరైన పత్రాలు లేకుండా రవాణా చేయరాదని సూచించారు. బక్రీద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని ఏసీపీ ప్రకాష్ యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందల్వాయి ఎస్సై సందీప్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

**అక్షరటుడే,ఆర్మూర్:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష పడింది. ఈ మేరకు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 8 మంది మద్యం తాగుతూ వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఒకరికి నాలుగు రోజుల జైలుశిక్ష, మిగతా ఏడుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చిందన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన సిలిండర్ల సీజ్

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో బుధవారం భరతమాత విగ్రహం సమీపంలోని ఇంట్లో అక్రమంగా ఉంచి సిలిండర్లను సివిల్ సప్లయ్ డీటీ పవన్ స్వాధీనం చేసుకున్నారు. యాదగిరి అనే వ్యక్తి ఇంట్లో వ్యాపారం నిమిత్తం ఇంట్లో దాచి ఉంచగా పక్కా సమాచారం మేరకు వాటిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం అధికారి పవన్ మాట్లాడుతూ.. డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార ప్రయోజనాలకు వినియోగించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్ కుమార్, జీపీవోలు అశోక్, అజయ్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.





## మూడో రోజుకు చేరిన వీవోఏల సమ్మె

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న వీవోఏల సమ్మె మూడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల ఐకేపీ అధికారి గంగరాజు, సీసీలు అన్నపూర్ణ, ప్రణిత, బాల్‌రాజు, మండల ఓబీలు సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీవోఏల మండల అధ్యక్షురాలు కళావతి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వీవోఏలకు రూ.26 వేల కనీస వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. పలుమార్లు ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో వీవోఏలలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారి సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఏపీఎం గంగరాజును కళావతి కోరారు.

## వరకట్న వేధింపుల కేసులో నిందితుల రిమాండ్



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** వరకట్న వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఘటనలో నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఏసీపీ ప్రకాశ్ వివరాలు వెల్లడించారు. గోవిందపల్లి గ్రామంలో అదనపు వరకట్న వేధింపులు తాళలేక మంగళవారం లక్షిత అలియాస్ కవిత అనే మహిళ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులైన మృతురాలి భర్త కర్రోల్ల నెహ్రూ, మామ కర్రోల్ల రాజులు, అత్త కర్రోల్ల సత్తెమ్మలను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారివద్ద నుంచి సెల్‌ఫోన్, ఆత్మహత్యకు ఉపయోగించిన చీరను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసును ఛేధించేందుకు కృషి చేసిన ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. ఈనెల 22న అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన సదరు వ్యక్తి, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాల కోసం వన్‌టౌన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో సూచించారు.